## వార్డెన్ శారద సస్పెన్షన్.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూలై 23, ప్రభాతవార్త :** సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో, ఇతర విద్యాసంస్థలలో చదివే ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ హెచ్చరించారు. నారాయణఖేడ్ బిసి బాలికల కళాశాల వసతి గృహంలో వార్డెన్ కె.శారద, కుమారుడు వసతి గృహంలోని విద్యార్థినులను వేధిస్తున్నట్లు విద్యార్థినిలు నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్‌ను ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి వసతి గృహంను తనిఖీ చేసి విచారణ జరిపినట్లు తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా వార్డెన్ కె.శారదను సస్పెన్షన్ చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఇద్దరిని విధులనుండి తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో వసతి గృహం సంక్షేమ అధికారిని సస్పెన్షన్ చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ సిబ్బందిని ఇద్దరినీ తొలగించి, శారద కుమారుడుని ఫోక్సో కేసులో అరెస్టు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ బుక్ చేసినట్లు బీసీ సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## చిన్నారులపై వీధి కుక్కల దాడి

**చిన్నశంకరంపేట, జూలై 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కామారం గ్రామంలో చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. కామారం గ్రామానికి చెందిన చిన్నారులు భార్గవి, బుజ్జమ్మ, ఆర్షిత, తనిష్, లింగంలు సాయంత్రం ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే వీరిని కుటుంబ సభ్యులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గజగట్లపల్లి, మదూర్ గ్రామాల్లో ఉదయం పూట ముగ్గు వేస్తుండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.

**రెండు నెలల్లో 60 మంది..**

మండల వ్యాప్తంగా గడిచిన రెండు నెలల్లో 60 మందికి పైగా వీది కుక్కల దాడిలో గాయపడ్డారని మండల వైద్యాధికారి సాయి సింధూ తెలిపారు. కుక్క కరిచిన వెంటనే నీటితో శుభ్రంగా కడగాలని, కారం, పసుపు వంటివి పెట్టకూడదని చెప్పారు. శుభ్రమైన బట్టతో కట్టుకట్టి వైద్యులను సంప్రదించాలని మండల వైద్యాధికారి సాయి సింధూ తెలిపారు.

### సింగూర్ నుంచి ఘనాపూర్ ఆనకట్టకు నీటిని విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, జూలై 23,ప్రభాతవార్త:** సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనాపూర్ ఆనకట్టకు ప్రతి సంవత్సరం రావలసిన 4.06 టిఎంసి నీటిని నిబంధనల ప్రకారం విడుదలచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డిని కోరినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ నీటిని విడతల వారీగా విడుదల చేయాలన్నారు. ఇప్పటికీ జూలై మాసం పూర్తిక వస్తుందని, వేసినటువంటి నారుమడులు అన్ని ఎండిపోకుండా, తక్షణమే నిబంధనల ప్రకారం ఉన్నటువంటి 0.5 టిఎంసి నీటిని వెంటనే విడుదల చేయాలని మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి కోరినట్లు ఆయన తెలిపారు.

### ఉచిత బస్సు పథకం విజయవంతంతో సంబరాలు

**నర్సాపూర్ జూలై 23, ప్రభాతవార్త:** ఉచిత బస్సు పథకం విజయవంతం కావడంతో బుధవారం నర్సాపూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మహిళా సాధికారత కార్యక్రమంలో ఐదు మంది మహిళలను ఎంపిక చేసి వారికి సన్మానం చేసి బహుమతులను అందజేశారు. అంతేగాక విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఉచిత బస్సు పథకం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు విజయవంతంగా నడుస్తున్నందున ఈ సంబరాలు జరుపుకుంటున్నట్లు డిపో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం సురేఖ, ఎస్ఐ జగన్నాథం, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, డిపో ఇన్‌చార్జ్ నరసప్ప, శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, నారాయణ, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

### తొగర్‌పల్లి, అలియాబాద్‌లను సందర్శించిన త్రిపుర రాష్ట్ర ప్రజాప్రతినిధులు



పల్లె ప్రకృతి వనంను పరిశీలిస్తున్న త్రిపుర ప్రజాప్రతినిధులు

**కొండాపూర్, జూలై 23(ప్రభాతవార్త):** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ రాజేందర్‌నగర్ సంస్థలో శిక్షణకు విచ్చేసిన త్రిపుర జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బాడీమెంబర్స్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి కె.జానకి, డిప్యూటీ సీఈవో ఆర్.స్వప్న బుధవారం మండలంలోని తొగరుపల్లి, అలియాబాద్ గ్రామాల్లో నర్సరీ, ఆగ్రిగేషన్ షెడ్లను సందర్శించారు. తదుపరి స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండల పరిషత్, అలాగే జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ చట్టం ఏవిధంగా పనిచేస్తున్నాయో పరిశీలించారు. అదేవిధంగా జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎంపీడీవో ఎం.సత్తయ్య స్వాగతించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, జాతీయ ఉపాధి హామీ పనులు, మహిళల స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలు అభివృద్ధిలో ఎలా భాగస్వాములు అవుతున్నారో వివరించారు. కార్యక్రమంలో ఏపీవో వీరప్ప పంచాయతీ కార్యదర్శులు నర్సమ్మ అరుణ అలాగే ఈసీ గణపతి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## యూరియాకు ఎలాంటి కొరత లేదు

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



గవ్వలపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

**చిన్నశంకరంపేట, జూలై 23,ప్రభాతవార్త:** యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు దారి మళ్లిస్తే, సంబంధిత ఎరువుల దుకాణం యజమానిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. బుధవారం మండల పరిధి గవ్వలపల్లిలోని రామలింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చేందవద్దన్నారు. ఎరువుల నిలువలను స్టాక్ బోర్డులో పొందుపర్చాలన్నారు. గోదాములో యూరియాను నిలువ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. అంతకు ముందు చిన్నశంకరంపేటలోని ఓ చాయ్ దుకాణంలో సామాన్యుడిలా వెళ్లి చాయి తాగుతూ అక్కడ చాయ్ త్రాగడానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు, ఏఈవో నాగేందర్‌లు ఉన్నారు.

## మత్తడి దూకుతున్న ఘనపురం చెక్ డ్యాం

**గంగమ్మకు పూజలు చేసిన రైతులు**

**నంగునూర్, జూలై 23, ప్రభాతవార్త :** రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని ఘనపూర్ పెద్ద వాగులోని చెక్‌డ్యాం పరవళ్లు తొక్కుతుంది. మండలంలో పెద్దగా వర్షాలు లేనప్పటికీ ఎగువ ప్రాంతంలోని మద్దూరు, లద్దునూరు. చేర్యాల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం బుధవారం నిండుకుండలా మారింది. పెద్దవాగు ఒక్కసారి నిండితే మూడు యేండ్ల వరకు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు తెలిపారు. వర్షాకాలంలో సమృద్ధిగా వాన లేకపోవడం వలన భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో చెక్ డ్యాం నిండుకోవడంతో సంతోషంగా ఉందని రైతులు తెలిపారు. వాగు పరివాహక ప్రాంత రైతులు అనందం వ్యక్తం చేస్తూ గంగమ్మకు పూజలు చేశారు.



మత్తడి దూకుతున్న దృశ్యం

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**




మాట్లాడుతున్న దామోదర్ రాజనర్సింహా

**చౌటకూరు, జూలై 23, ప్రభాతవార్త:** మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందని వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన అందోల్ నియోజకవర్గ ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి, స్వయం సహాయక మహిళా శక్తిని గుర్తించడమే లక్ష్యంగా విజయోత్సవాలకు ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందన్నారు. రాష్ట్రంలోని మొదటగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో మహిళా స్వయం సహాయక సంఘంద్వారా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశామన్నారు. పెట్రోల్ బంక్ ద్వారా జిల్లా సమైఖ్య సంఘానికి రూ. 5 లక్షల ఆదాయం సమకూరుతుందని చెప్పారు. మహిళలకు పావలా వడ్డీతో రుణాలను అందేస్తున్నామన్నారు. మహిళలకు కోటీశ్వరులు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగాపెట్టుకుని పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో బిఆర్ఎస్ పాలనలో కొత్తగా ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్‌కార్డులు, 200 యూనిట్లవరకు ఉచితంగా విద్యుత్ సరఫరా, రూ. 500 గ్యాస్ సిలెండర్, వడ్డీ లేని రుణాలను, ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశామని, బాలికలు ఉన్నత విద్యను అందుకునేందుకు మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసి చైర్మన్ తూర్పు నిర్మిలా జయప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, డిఆర్‌డిఓ పిడి జ్యోతి, ఆర్‌డిఓ పాండు, ఐకెపిడిపిఎం రమేష్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పుల్‌కల్, చౌటకూరు మండలాల అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు పుల్లారెడ్డిగారి మహిపాల్‌రెడ్డి,గోవర్ధన్, సరాఫ్ పల్లి రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, రాజశేఖర్, రామాగౌడ్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## భూసార పరీక్ష రైతన్నకు రక్ష

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**హవేలీఘన్‌పూర్, జూలై 23 ప్రభాతవార్త :** భూసార పరీక్ష రైతన్నకు రక్ష అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం హవేలీఘనపూర్ మండలం కూచన్‌పల్లి రైతు వేదికలో లారస్ ల్యాబ్ చారిటబుల్ ట్రస్ట్, ఇక్రిసాట్ సంయుక్తంగా కలిసి భూపరీక్ష వాహనం ద్వారా రైతుల ముంగిట్లోకి భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలను నేల ఆరోగ్యకార్డు రూపంలో అందించడం, పంటలకు సరైన మోతాదులో రసాయన ఎరువుల వినియోగం ద్వారా సమగ్ర పోషక యాజమాన్యం పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించడం తద్వారా అధిక దిగుబడులు సాధించుకుంటూ నేల సంరక్షణ దోహదం చేయడంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భూసార పరీక్ష రైతన్నకు రక్ష అని అన్నారు. ఈ వాహనం ద్వారా పొలం నుండి మట్టి నమూనాలను తీసుకుని పరీక్షలు నిర్వహించి రైతులకు నేల ఆరోగ్యకార్డును అందజేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలానికి ఏ రకాల ఎరువులు అవసరమో తెలుసుకోవచ్చు, తదనుగుణంగా పంటలను సాగు చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హవేలీఘన్‌పూర్ మండలం కుచాన్‌పల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు ఇక్రిసాట్ వారి ద్వారా భూసార పరీక్షలు నిర్వహణ అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థు లకు అందుతున్న మెనూపరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నలు జవాబులతో పరీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ కుమార్ గారు ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు డాక్టర్,పుష్పాజిత్ చౌదరి, విజయ రంగనాథ్, ఏడిఏ విజయ నిర్మల, ఎంఈఓ మదన్ మోహన్, ఎంఏఓ బాల్ రెడ్డి మరియు ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ఏఈఓ లు రైతులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

### మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన రద్దు

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 23వ తారీఖున రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాలతో మంత్రి పర్యటన రద్దయిందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని నారాయణఖేడ్, సిర్గాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉండగా మంత్రి పర్యటన రద్దుతో ప్రారంభోత్సవాలకు వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

### ఘనపురం ప్రాజెక్టుకు సింగూరు నీటిని విడుదల చేయాలి

**మంత్రికి లేఖ రాసిన వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్**

**పాపన్నపేట, జూలై 23,ప్రభాతవార్త:** ఘనపురం ప్రాజెక్టుకు వెంటనే సింగూరు నీటిని విడుదల చేయాలని కోరుతు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి బుధవారం ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి లేఖ రాసినట్లు కాంగ్రెస్ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఘనపురం ఆనకట్ట కిందఉన్న రైతాంగం వరి తుకాలువేసి, నీళ్లలేక నాట్లు వేయలేని పరిస్థితిలో ఉందన్నారు. సింగూరులో ప్రస్తుతం 19 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కనీసం నాట్ల కోసం 0.3 టీఎంసీల చొప్పున, మూడు నుంచి నాలుగు సార్లు నీరు వదలాలన్నారు. గతంలో డెడ్ స్టోరోజ్లో సైతం సింగూరు నీరు వదిలిన సంధార్భాలు ఉన్నాయన్నారు. నీరు వదలక పోతే, రైతులు ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి పక్షాలకు కూడా ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేసే అవకాశం ఉందని చైర్మన్ లేఖలో సూచించారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఘనపురం ఆనకట్ట క్రింద ఉన్న రైతాంగం వరి తుకాలు వేసి,నీళ్ల లేక నాట్లు వేయలేని పరిస్థితిలో ఉందన్నారు. సింగూరులో ప్రస్తుతం సుమారు 19 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కనుక కనీసం నాట్ల కోసం 0.3 టీఎంసీల చొప్పున, మూడు నుంచి నాలుగు సార్లు నీరు వదలాలన్నారు. గతంలో డెడ్ స్టోరోజ్లో సైతం సింగూరు నీరు వదిలిన సంధార్భాలు ఉన్నాయన్నారు. నీరు వదలక పోతే, రైతులు ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి పక్షాలకు కూడా ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేసే అవకాశం ఉందని చైర్మన్ లేఖలో సూచించారు.ఇంతకు ముందే మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సైతం మంత్రిని కలసి, నీరు వి దుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్**

**చౌటకూరు, జూలై 23, ప్రభాతవార్త:** వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ సూచించారు. బుధవారం సింగూరు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జలాశయాలను చూసేందుకు వచ్చే పర్యాటకులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వరద వివరాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలాశయాలు, కుంటలు, చెరువులను చూడటానికి వెళ్లవద్దని హితువు పలికారు. చెరువులన్నీ ఇప్పుడిప్పుడే నిండుతున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, జిల్లా పోలీసు కంట్రోల్ రూం నంబర్ 8712656739కు సమాచారం అందించాన్నారు. పోలీసు ఠాణాలలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడికి అక్కడ సూచిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈఈ మహిపాల్‌రెడ్డి, పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్‌లు పాల్గొన్నారు.



సింగూరు డ్యామ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజక్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

### యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవు

**విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన పోలీసు అధికారులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో కొంత మంది వ్యక్తులు ఫ్లాట్రీఫామ్‌లతోపాటు ఫర్టిలైజర్ షాపులలో అక్రమంగా యూరియా దాచిపెట్టి రైతులను, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసు అధికారులు బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ సిఐ రమేష్, వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, అర్బన్ మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో టూ టౌన్ పరిధిలోని అఫ్జల్ డెయిరీ, పట్నాల, కుంకుమ మిల్లులు, ఫర్టిలైజర్ షాపులతో పాటు అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. పొన్నాల గ్రామ శివారులోని అశోక్ లేలాండ్ సర్వీసింగ్ సెంటర్, పటేల్ డెయిరీ, ఫార్మ్‌కృష్ణసాగర్, ఫర్టిలైజర్ దుకాణాలు, దుద్దెడ రైస్‌మిల్, బందారం పైప్స్ ఫ్యాక్టరీ, అంకిరెడ్డిపల్లి తదితర అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. అనంతరం పోలీసు అధికారులు మాట్లాడుతూ యూరియా దాచిపెట్టిన బ్లాక్ మార్కెట్‌కు తరలించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. అలాగే సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ శివారులోని శ్రీ వెన్ ఫార్మస్‌లో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

### ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలి : ఏసిపి




పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసిపి సదానందం

**కొమురవెల్లి, జూలై 23, ప్రభాతవార్త :** సమర్థవంతంగా విధులు నిర్వహించాలని హుస్నాబాద్ ఏసిపి సదానందం పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం కొమురవెల్లి పోలీసుస్టేషన్ సందర్శించారు.ఈ సందర్భంగా రికార్డులను, పోలీసు పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే పోయే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయానికి ఎవరూ వస్తున్నారు ఎవరూ పోతున్నారు ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విపిఓ వ్యవస్థను మెరుగుపరచాలని వారంలో రెండు మూడు సార్లు గ్రామాలను సందర్శించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. విజబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు, చేర్యాల ఎస్ఐ నవీన్,హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, పోలీసులు పాల్గొన్నారు.

### నర్సారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

**గజ్వేల్ టౌన్, జూలై 23 ప్రభాతార్త :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని బుధవారం యాదగిరిగుట్ట భువనగిరి జిల్లా కాచారం రేణుకా ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు, వాసవి ఉపాసకులు డాక్టర్ వంగపల్లి అంజయ్యస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంజయ్యస్వామి మాట్లాడుతూ ఈనెల 29న కాచారం రేణుకాఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ కళ్యాణం, నాగులపంచమి వేడుకలు, ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేసినట్లు తెలిపారు.అలాగే గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, గజ్వేల్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ, ఆలేరు ఆర్యవైశ్య నాయకుడు బిజ్జాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

* అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీలు, రికార్డుల పరిశీలన
* అధికారులు అప్రమత్తంగా ఉండకపోతే చర్యలు తప్పవు * సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**చేర్యాల, జూలై 23,ప్రభాతవార్త**

వానలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. బుధవారం కలెక్టర్ చేర్యాల పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులను తనిఖీలు చేయగా రిజిస్టర్ నిర్వహణ సరిగాలేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలం వ్యాధులు వ్యాపించకుండా చూడాలని, అలాగే ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. అలాగే నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రస్తుతం నడుస్తున్న ఆసుపత్రి పరికరాలను నూతన భవనంలోకి చేర్చి అక్కడే వైద్యసేవలు ప్రారంభించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేశారు. అలాగే పట్టణంలోని పలువురి లబ్దిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక సరాఫరకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తే పనిని బట్టి అధికారులు పరిశీలించి డబ్బులు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. అలాగే పెద్దమ్మగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని తనిఖీలు చేశారు. ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల డిస్పోజల్ పరిశీలించారు. అలాగే దరఖాస్తుదారులకు నోటీసులు జారీచేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై వారానికి ఒక మండలం చొప్పున కలెక్టరేట్‌లో సమీక్షించనున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తదితరులు

## ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

**500 గ్రాముల గంజాయి స్వాధీనం**

**మునిపల్లి, జూలై 23 (ప్రభాతవార్త):** అక్రమంగా రవాణా చేస్తున్న ఎండు గంజాయిని మునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నట్టు ఎస్సై రాజేష్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం...గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మోజాల ఈశ్వర్, సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలి గ్రామానికి చెందిన బోయిని నిఖిల్ టివిఎస్(ఎపి39ఎస్‌కె9623)పై ఎండు గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో టోల్ ప్లాజవద్ద వాహనాలు తనఖీ చేస్తుండగా జహిరాబాదు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వారి బైకును ఆపి తనిఖీ చేయగా 500 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. బీదర్‌లోని ఇరానీ గల్లీలో గుర్తు తెలయని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేశామని వారు చెప్పారు. వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, టివిఎస్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేష్‌నాయకన తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండుగంజాయి

## అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, జూలై 23, ప్రభాతవార్త:**
ఆషాఢమాసం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమం నిర్వాహకులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు బోనాలపండుగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆయాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీకేతకి ఆలయానికి భక్తుల పాదయాత్ర

**మనూర్, జూలై 23, ప్రభాతవార్త:**
జహీరాబాద్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం ఆశాడ అమావాస్యను పురస్కరించుకుని దర్శించుకునేందుకు బుధవారం మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాదయాత్రగా శివనామస్మరణ చేస్తూ పాదయాత్రగా బయలు దేరారు. మండలం నుంచి ఆశాడ ఆమావాస్యను పురష్కరించుకుని కేతకి సంగమేశ్వర ఆలయానికి గత 6 సంవత్సరాలుగా భక్తులు పాదయత్రగా చేరుకుని పార్వతీ దేవి సమేతంగా ఉన్న కేతకి సంగమేశ్వరుడిని దర్శించుకుంటూ వస్తున్నారు. పాదయత్రగా వెళ్లిన వారిలో వెంకటరామిరెడ్డి, డాక్టర్ అమృత్, రవీందర్ నాయక్, శివకుమార్,బిరదర్ దత్తు, శ్రీకాంత్‌రెడ్డి, శిరూర్ మారుతి, జూకంటి మారుతి తదితరులు ఉన్నారు.

## మహాలక్ష్మి పథకం ప్రయాణికులకు సన్మానం

**-మహాలక్ష్మి ప్రయాణికులతో ఉచిత ప్రయాణం**



మహిళాప్రయాణికులను సన్మానిస్తున్న మున్సిపల్‌కమిషనర్ సుభాష్‌రావు

**జహీరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:**
మహాలక్ష్మి పథకంలో ఉచిత ప్రయాణాలు చేసిన మహిళలకు బుధవారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ డి.సుభాష్‌రావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణలు హాజరై మహిళలకు మహాలక్ష్మి పథకం గురించి వ్యాసరచన పోటీలునిర్వహించి ఉత్తమప్రతిభ చాటిన మహిళలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టి.స్వామి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ ఇంచార్జి తిరుమలేష్, డిపో సూపర్‌వైజర్, డిపోసిబ్బంది, మహిళాప్రయాణికులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి రిపోర్ట్ లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగులను అవమానిస్తున్న ప్రభుత్వం

**పాపన్నపేట, జూలై 23, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యుఎస్‌పిసి మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా నేడు పాపన్నపేట మండల డిప్యూటీ తహసీల్దార్ చరణ్‌సింగ్‌కు ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలతో కూడిన ప్రమోషన్లు ఇవ్వాలని, రెండు సంవత్సరాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పెండింగ్ డిఏలను ప్రకటించాలని, ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్ల గడిచిపోయిన తర్వాత పిఆర్‌సి రిపోర్టు తెప్పించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను అవమానించడమేనని, సిపిఎస్ రద్దుచేయాలని, 317 జివో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, మిగిలి ఉన్న పండిట్, పిఈటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.హీరలాల్, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, బాలరాజు టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు భూషణం, యుటిఎఫ్ జిల్లా నాయకులు, శ్రావణ్‌కుమార్, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు రఫిక్, తన్మయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి సిఐ వెంకటేశం

**గజ్వేల్ టౌన్, జూలై 23, ప్రభాతవార్త:**
గజ్వేల్ మున్సిపాలిటీపరిధిలోని సంగాపూర్‌లోగల అల్-హక్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహిస్తున్న జామియా-ఉల్-హక్ నుండి పట్టభద్రులైన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి సిఐ వెంకటేశం హాజరై మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు సమ్మేళనకార్యక్రమం చేసుకోవడం అభినందనీయమన్నారు. మౌల్వీ ఖాజీ ముహమ్మద్, ఖాసీం షరిఫి అమీర్ జమాతే ఇస్లామీ హింద్ ఉర్దూ లెక్చరర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫయాజ్‌ఆలం, అన్వర్, ఖలీద్, మజ్హర్, ఉస్మాన్, మోహసిన్, నిజాముద్దీన్, కరీముద్దీన్, సలాహుద్దీన్, జునైద్‌బా, నవాబ్, ఖ్వాజామొయినుద్దీన్, షబాబుద్దీన్, మహమూద్, రబ్బాని, మునీర్, అన్జార్, ఉపాధ్యాయులు జహీరుద్దీన్, అబ్దుల్ మొయిజ్, ఖాసీం, గణేష్, నగేష్, ఆరిఫ్, యాసిన్, నరేష్, నర్సింలు, బాలు, రామకృష్ణ, రాజు, బలస్వామి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగండి

**-గీతం ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సూచన**

**పటాన్‌చెరు, జూలై 23, ప్రభాతవార్త:**
విశ్వవిద్యాలయం కేవలం వినోదం కోసం కాదని, అంకితభావం, పరివర్తన కోసం నిర్దేశించిన ప్రదేశమని, ఇక్కడున్న అత్యుత్తమ వనరులన్నింటినీ సద్వినియోగం చేసుకుని పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగాలని తొలి ఏడాది విద్యార్థులకు గీతం ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా ఉద్బోధించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తొలి ఏడాది విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. కొత్తగా చేరిన విద్యార్థులను విశ్వవిద్యాలయ విద్యావ్యవస్థ, పలువిభాగాలు, విద్యార్థిక్లబ్‌లు, కెరీర్ మార్గదర్శకసూచనలు, క్రీడా మౌలిక సదుపాయాలను పరిచయం చేయడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమం ఆగస్టు 1వ తేదీ వరకు కొనసాగనుంది. తన ప్రారంభోపన్యాసంలో, డాక్టర్ ఎర్రోల్ డిసౌజా తొలి ఏడాది విద్యార్థులను స్వాగతించారు. వారంతా జ్ఞాన ఆధారిత సంస్థలో చేరడం సంతోషంగా చేసుకోవాలని డాక్టర్ డిసౌజా సూచించారు. గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు విశ్వవిద్యాలయ విద్యానైపుణ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

**-ఇందిరా మహిళాశక్తి విజయోత్సవాల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**




మహిళాసంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జూలై 23, ప్రభాతవార్త:**
మహిళలను ఆర్థికంగా బలోపేతంచేయడమే కాంగ్రెస్ ప్రభుత్వలక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా గార్డెన్‌లో ఇందిరా మహిళాశక్తి విజయోత్సవాలు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు మొదటి ఏడాదిలో రూ.21000కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని, పాఠశాలలు, క్యాంటీన్లు, స్కూల్ యూనిఫాం తయారీ వంటి ప్రభుత్వ పనులు మహిళలకు అప్పగిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. మహిళాసంఘాల అభివృద్ధి ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని, ఈరుణాలు వారి కుటుంబాల్లో కొత్త జీవనోపాధికి మార్గం వేస్తాయన్నారు. స్వయం సహాయక సంఘాలు మహిళల జీవితాలలో భారీమార్పులు తీసుకువస్తాయని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని, ఇదే మాప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గడిచిన బిఆర్ఎస్ 10సంవత్సరాలలో ఏ ఒక్కరికి కూడా ఒక్క రేషన్‌కార్డును ఇచ్చిన పాపాన పోలేదని, పెళ్లయిన 10సంవత్సరాలు గడిచినా, పిల్లలు పుట్టి పెద్దయినా కూడా వారికి రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో మాటిచ్చి నిలబెట్టుకున్నామని అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడవద్దనే ఉద్దేశ్యంలో భాగంగా పట్టణం చుట్టూ లింకురోడ్డులను కలిపే రింగురోడ్డును ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తదితర ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

**-మండల వైద్య అధికారి మధుకర్, మున్సిపాల్ కమిషనర్ దశరథ్**



సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 23, ప్రభాతవార్త:**
గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ దశరథ్, ప్రభుత్వ వైద్యాధికారి మధుకర్ పాల్గొని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలానుగుణంగా వ్యాధుల నియంత్రణపై వివిధ ప్రభుత్వశాఖల అధికారుల మధ్య సమన్వయం కల్పించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియచేయాలని సూచించారు. హ్యాండ్‌వాష్, డ్రై డే యాక్టివిటీ పాటించాలని సూచించారు. ఆగస్టు 10వ తేదీ నుండి ఎండిఏ కార్యక్రమంలో ఆల్బెండజోల్, డిఈసి మాత్రలు, ప్రతి ఒక్కరికీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఫైలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఫైలేరియా నిర్మూలనలో భాగంకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఈఓ ప్రభాకర్, సంగీత, ఈఓలు ఎఎన్ఎం, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి

**-సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, జూలై 23, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలంలోని మంబాపూర్‌గ్రామానికి చెందిన కంజర్ల సుదర్శన్, రోడ్డుప్రమాదంలో, నీరుడి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించారు. ఈవిషాదకర సమయంలో వారికుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వారికుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి, ఈదుఃఖాన్ని తట్టుకోగలిగే ధైర్యాన్ని దేవుడు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు, స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డిని కలిసి వారిసమస్యలు వినిపించారు. మృతుల ఆత్మలకు శాంతిచేకూరాలని, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు ఆయన భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, నాయకులు ప్రకాష్, దయానంద్, లక్ష్మణ్, రాజు, వీరయ్య, వీరేష్, రమేష్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

**గజ్వేల్ టౌన్, జూలై 23, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లో తాగునీటి సమస్య నెలకొందని, అలాగే కుక్కల, కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వర్షం నీరు నిలుస్తుందని, చంబర్లు పగిలి ప్రమాదకరంగా మారాయన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈదుగాని శివులు, భూమిని ప్రశాంత్, పెర్క నాగరాజు, సోం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**-మండల విద్యాధికారి మధుమోహన్**



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి మధుమోహన్

**హవేలీఘన్పూర్, జూలై 23, ప్రభాతవార్త:**
విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించాలని మండల విద్యాధికారి మధుమోహన్ అన్నారు. మండలపరిధిలోని కూచంపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కనుక వంటపాత్రలను, వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేయరాదని పరిశుభ్రంగా ఉన్న కూరగాయలు విద్యార్థులకు అందించాలని మండల విద్యాధికారి సూచించారు.

## ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలు చర్చించుకోవాలి

**-రాష్ట్ర జెండర్ సలహాదారు జమున**

**నర్సాపూర్, రూరల్, జూలై 23, ప్రభాతవార్త:**
ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలు చర్చించుకోవాలని రాష్ట్ర జెండర్ సలహాదారు జమున అన్నారు. బుధవారం మండలపరిధిలోని చిన్నచింత కుంటగ్రామంలో సెర్ప్ సంస్థ జెండర్ అంశంపై గ్రామంలో ఉన్న చిన్నసంఘాలలో నుండి ఎన్నుకోబడ్డ జెండర్ పాయింట్ పర్సన్‌ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంఘంలో ఒక జెండర్‌పాయింట్ పర్సన్‌ను ఎంపికచేసుకొని, సంఘంజరిపే సమావేశంలో ఆర్థిక అంశాలతోపాటు సామాజిక అంశాలు చర్చించుకోవాలి. అదే విధంగా గ్రామంలో జెండర్‌వేదిక ఏర్పాటుచేసుకొని ప్రతినెల సమావేశం ఏర్పాటుచేసుకోవాలి. ఇందులో గ్రామసర్పంచ్, అంగన్‌వాడీ ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, స్కూల్ హెడ్మాస్టర్‌లు పాల్గొని నిర్ణయాలు తీసుకొని గ్రామంలోని సోషల్ ఆక్షన్ కమిటీ ద్వారా మహిళల సమస్యలకు పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు. మండలంలోని జెండర్ రిసోర్స్ కేంద్రము మండలసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఇందులో ఐసిడిఎస్ సూపర్వైజర్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, డాక్టర్, స్వచ్ఛందసంస్థలు సభ్యులుగా ఉండి సమావేశం ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించడానికి దోహదపడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ లింగయ్యగౌడ్, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్, ఎపిఎం మార్గం గౌరీశంకర్, సిసి ప్రవీణ గ్రామ సంఘం అధ్యక్షులు పావని సిఏలు నాగరత్న, లక్ష్మీ, మండలసమాఖ్య అధ్యక్ష కోశాధికారులు సుమలత, జ్యోతి, అకౌంటెంట్ మల్లేశం, ఆపరేటర్ సురేష్, సామాజిక సమస్యల పరిష్కారకమిటీ చింతల లక్ష్మీ, గ్రామంలోని అన్నిసంఘాల జెండర్ పాయింట్ పర్సన్‌లు, మండల సమైక్యస్థాయి నిర్వహించిన సమావేశంలో అన్ని గ్రామసంఘాల నుంచి వచ్చిన గ్రామ జెండర్ పాయింట్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

## వంగపల్లి అంజయ్యస్వామికి ఘన సన్మానం



వంగపల్లి అంజయ్యస్వామిని సన్మానిస్తున్న గోలి సంతోష్

**గజ్వేల్ టౌన్, జూలై 23, ప్రభాతవార్త:**
యాదగిరిగుట్ట భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం కాచారం శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయవ్యవస్థాపక అధ్యక్షుడు, వాసవి ఉపాసకులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ధార్మిక పరిషత్ అధ్యక్షులు వంగపల్లి అంజయ్యస్వామిని బుధవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, సిద్దిపేట జిల్లా ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి సంతోష్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ దేవాలయ మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, ఆలేరు ఆర్యవైశ్య నాయకుడు బిజ్జాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

**కొల్చారం, జూలై 23, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల మేరకు బుధవారం కొల్చారం పరిధిలోగల కోళ్ల దాణా పరిశ్రమను ప్రత్యేక తనిఖీ నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వ్యవసాయానికి వాడాల్సినటువంటి యూరియాను ఇతర పరిశ్రమ అవసరాలకు వాడుతున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా కలెక్టర్, రెవిన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులకు తనిఖీలు నిర్వహించాల్సిందిగా ఆదేశించిన నేపథ్యంలో కొల్చారం మండలంలోని పోతాంశెట్టిపల్లి శ్రీలక్ష్మి పౌల్ట్రీ ఫార్మ్ పరిధిలోగల కోళ్ల దాణా పరిశ్రమను సందర్శించడం జరిగింది. ఈసంఘటనలో ఎలాంటి వ్యవసాయ సంబంధ యూరియా వాడటంలేదని తనిఖీల్లో గుర్తించడం జరిగింది. అదేవిధంగా దాణా తయారీలో వాడుతున్న పదార్థాల వివరాలన్నిటినీ సంచులపై ముద్రించాలని ఈదాణాలో వాడే పదార్థాలను తప్పనిసరిగా సమాచారపత్రాన్ని వాడుతున్నటువంటి కస్టమర్లకు అందించాలని ఈసందర్భంగా ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో కొల్చారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, ఎస్ఐ మొహమ్మద్ గౌస్, పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలనిమిత్తం మాత్రమే యూరియాను వాడుకోవాలని ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ గాని, పరిశ్రమల అవసరాలకుగాని వాడినట్టయితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించడం జరిగింది. అలాగే ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేయడం జరిగింది.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపిడిఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ ఆపరేటర్లు

**చిన్నశంకరంపేట, జూలై 23, ప్రభాతవార్త:**
పెండింగ్ వేతనాలు చెల్లించాలని పంచాయతీ ఆపరేటర్లు ఎంపిడిఓ దామోదర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. బుధవారం వారు మాట్లాడుతూ 2015వ సంవత్సరం నుండి విధులు నిర్వహిస్తున్నామని గతంలో జిల్లానుండి వేతనాలు అందేవని, ప్రభుత్వం 2025 జనవరి నెలనుండి కమిషనర్ కార్యాలయం భాగ్యనగరంనుండి వేతనాలు అందిస్తుందన్నారు. వేతనాలు జనవరి నుండి రూ.22750 ఇవ్వాల్సి ఉండగా రూ.19500 మాత్రమే ఖాతాలో జమచేస్తుందన్నారు. వేతనాలు తగ్గించి వేయడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నేడు విధులు బహిష్కరించి పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయానికి వెళ్తున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో పంచాయతీ ఆపరేటర్లు, లక్ష్మణ్, శ్రీనివాస్, అరవింద్, రాజులున్నారు.

## పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, జూలై 23, ప్రభాతవార్త:**
వీరశైవ లింగాయత్ సమాజం పటాన్‌చెరు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విశ్వశాంతికై పటాన్‌చెరు నుండి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు నిర్వహించే 18వ మహాపాదయాత్ర పోస్టర్‌ను బుధవారం పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. విశ్వశాంతికై 18సంవత్సరాలగా పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదేస్ఫూర్తితో ముందుకుకొనసాగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, జూలై 23, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని కొమురవెల్లిలో బుధవారం ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ ఆధ్వర్యంలో పంచాయతీకార్యదర్శి హరిప్రసాద్, ఆశాకార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లారిచిన నీరు తాగాలని..భోజనం వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలన్నారు. ఇంట్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు.

## అభివృద్ధి పేరిట కోట్లు దోచుకున్న కెసిఆర్ కుటుంబం

**-నిండా మునిగిన నిర్వాసితులు బిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి**

**-డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్, జూలై 23, ప్రభాతవార్త:**
గజ్వేల్ అభివృద్ధి పేరిట కెసిఆర్ కుటుంబం వందల కోట్లు దోచుకుందని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్ మున్సిపల్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కమిషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇవ్వగా, కెసిఆర్ ప్రారంభించిన యుజిడి, రింగ్‌రోడ్డు, సిసి రోడ్లు, బస్టాండ్, అంతర్గత రోడ్ల అభివృద్ధి, పాతబస్తీ విస్తరణ తదితర అసంపూర్తి దశలోనే నిలిచిపోయినట్లు ఎద్దేవాచేశారు. కేబినెట్ మంత్రి హోదాలో సకల వసతులు పొందుతున్న కెసిఆర్ ఇక్కడి సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టంచేశారు. గజ్వేల్ పెండింగ్ పనులు, మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన కెసిఆర్ ఫాంహౌస్ వీడి రావాలని, ఆయన అడిగితే నిధులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వచ్చే నెలరోజుల్లో గజ్వేల్‌తో పాటు నియోజకవర్గంలో మార్పులురానుండగా, స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొనగారి రాజు, నక్క రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్ సమీర్, రాజ్‌కుమార్, నర్సింలు, నక్క రేగొండగౌడ్, మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు హజార్, నేతలు లక్ష్మారెడ్డి, జహీర్, గుంటుకు శ్రీనివాస్, ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, డాక్టర్ వహీద్, ఇక్బాల్, శ్రీనివాస్, అంజద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికతో పని చేయించుకుంటున్న వారిపై కేసు నమోదు

**నర్సాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
మైనర్ బాలికతో పని చేయించుకుంటున్న యజమానిపై కేసు నమోదు చేసిన సంఘటన నర్సాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఎస్‌హెచ్‌ఓ జగన్నాథం కథనం ప్రకారం ఇలా ఉన్నాయి.. నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసి బస్‌స్టాప్‌లోగల పుష్ప బిగ్ బజార్ షాప్‌లో ఆషాపు యజమాని ఇర్ఫాన్ అలీ అతను మైనర్ బాలికతో షాపులో గత కొన్నిరోజులుగా పనులు చేయించుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు రెస్క్యూ ఆపరేషన్లు చేస్తుండగా నర్సాపూర్ బస్టాండ్‌లోని పుష్ప బిగ్‌బజార్ షాప్‌లో షాపుయజమాని ఇర్ఫాన్ అలీ మైనర్ బాలికతో పనులుచేయించుకున్నట్లు తెలిసి ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు స్వయంగా పట్టుకున్నారు. ఈమేరకు టీం సభ్యుల ఫిర్యాదు మేరకు నర్సాపూర్ ఎస్‌హెచ్‌ఓ జగన్నాథం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జూలై 23, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా గార్డెన్‌లో బుదవారం నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని మండలాలకు సంబంధించిన దాదాపు 203 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ 217మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపేదవారికి సిఎంఆర్‌ఎఫ్ అందేవిధంగా ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రతి పేదవాడికి రూ.10లక్షల వరకు అందిస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**-పాల్గొని పూజలు చేసిన ఆదర్శ్‌రెడ్డి**



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆదర్శ్‌రెడ్డి దృశ్యం

**రామచంద్రాపురం, జూలై 23, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయాకాలనీల్లో గురువారం ఆశాఢమాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు బోనాల ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లోభాగంగా బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరుడివిజన్‌కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలారం బండినడిపి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌చారి, జగన్నాథ్‌రెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్వీ బనకచర్ల జంగ్ సైరెన్ కార్యక్రమం



బిఆర్ఎస్వీ పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సదాశివపేట, జూలై 23, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం గోదావరి, కృష్ణానదుల అనుసంధానంతో బనకచర్లలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు బిఆర్ఎస్ విద్యార్థివిభాగం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జంగ్ సైరెన్ కార్యక్రమాన్ని బుధవారం సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఆర్ఎస్‌పార్టీ సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ యంఎల్ఎ చింతా ప్రభాకర్ ఆదేశాలతో బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు పెద్దగొల్ల శ్రీహరి ఆధ్వర్యంలో చేపట్టడం జరిగినది. కార్యక్రమంలోభాగంగా విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా జరుగుతున్న నష్టాన్ని కరపత్రాలను పంపిణీ చేసి వివరించడం జరిగినది. కేంద్రజలసంఘం ఆమోదం, అపెక్స్ కమిటీల అమోదం లేకుండా వరద జలాలలో తెలంగాణకు రావలసిన వాటా తేల్చకుండా ప్రాజెక్టునిర్మాణం అక్రమం అని తెలపడం జరిగినది. అనంతరం కళాశాల నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగినది. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మన్సూర్, జిల్లా కో-ఆర్డినేటర్ రాజేందర్, పట్టణ, మండలాల అధ్యక్ష కార్యదర్శులు రోషన్, పాండునాయక్, అక్షయ్, నాసర్, నాయకులు అఖిల్, నవీన్, కార్తీక్, శశి, శివ, రాకేష్, తరుణ్, భాను పాల్గొన్నారు.

## సదాశివపేట్‌లో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**సదాశివపేట, జూలై 23, ప్రభాతవార్త:**
డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వామపక్ష విద్యార్థి సంఘాల బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ సదాశిపేట పట్టణంలో ప్రభుత్వపాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటువిద్యాసంస్థలను బందుచేయించడం జరిగింది. ఈసందర్భంగా డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లాకార్యదర్శి అనిల్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కరించాలన్నారు. ప్రభుత్వపాఠశాలలో మౌలిక సదుపాయాలుకల్పించాలి, విద్యాశాఖమంత్రిని వెంటనే నియమించాలి, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి, రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి, ప్రభుత్వపాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్, హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాడ్‌చేశారు.

## బుస్సారెడ్డిపల్లి రోడ్డును బాగు చేయండి

**మునిపల్లి, జూలై 23, ప్రభాతవార్త:**
మునిపల్లి చౌరస్తా నుంచి బుస్సారెడ్డిపల్లి వరకుగల రోడ్డు అధ్వాన్నంగా తయారైందని ఈరోడ్డును వెంటనే బాగుచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి దుర్గనోళ్ల కుమార్ ఒక ప్రకటనలో కోరారు. బుస్సారెడ్డిపల్లి, మల్లారెడ్డిపేట గ్రామస్థులు మండలకేంద్రానికి వెళ్లడానికి అనేక తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈరోడ్డు గుండా వెళ్లడానికి వాహనాలు, ఆటోలు రావడానికి భయపడుతున్నారని అన్నారు. మునిపల్లి చౌరస్తా నుంచి సింగూర్‌ప్రాజెక్టు వరకు రోడ్డు గుంతలమయంగా మారందని ఈరోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఈరోడ్డును వెంటనే బాగుచేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లను తొలగించాలని ఆయన డిమాండ్‌చేశారు. లేని యెడల వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో అందోళన చేపడ్తామని ఆయన హెచ్చరించారు.

## ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

**-రైతులకు అవగాహన కల్పించిన అధికారులు**



ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నాగల్‌గిద్ద, జూలై 23, ప్రభాతవార్త:**
ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవన అధికారి మౌనికరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యానవన అధికారి మౌనికరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారిలు మాట్లాడుతూ ప్రభుత్వం పంటలను సాగుచేసే రైతులకు 90శాతం సబ్సిడీ అందిస్తోందని గుర్తుచేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట సాగుచేస్తే రైతులు దీర్ఘకాలంగా లాభాలను ఆర్జించవచ్చన్నారు. ఈసందర్భంగా రైతులకు పంటసాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించే కరపత్రాలను పంపిణీ చేశారు.

## ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి

**-విధులు బహిష్కరించిన ఆపరేటర్లు**

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
బకాయిపడ్డ వేతనాలను మంజూరుచేసి తమకు ఉద్యోగభద్రత కల్పించాలని పంచాయతీ కార్యాలయ ఆపరేటర్లు గురువారం మండల పంచాయతీ అధికారి బ్రహ్మయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు జన్నుబాయి, సుదర్శన్‌లు మాట్లాడుతూ తమకు 22వేల750 రూపాయల వేతనం అందించాల్సి ఉండగా 19వేల500 వందల రూపాయలనే తమ వ్యక్తిగతఖాతాలో క్రెడిట్‌చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. పూర్తిస్థాయిలో వేతనం అందితేనే కుటుంబపోషణ భారంగా ఉంటుందని, వేతనాన్ని కుదించివేస్తే తమ పరిస్థితి ఎలా అని వారు ప్రశ్నించారు. గురువారం విధులను బహిష్కరించామన్నారు. అధికారులు స్పందించి తమకు ఉద్యోగభద్రత కల్పించాలని వారు డిమాండ్‌చేశారు.

# జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మించాలి

**-అదనపు గదులు నిర్మించాలని ధర్నా**
**-ఆర్డీఓకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ నాయకుల వినతి**



ఆర్డీఓకు వినతిపత్రం అందచేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ నాయకులు

**జహీరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడగదులు లేక విద్యార్థులు ఇరుకిరుకుగా కూర్చొని విద్యను అందుకోవాల్సిన దుస్థితి దాపురించిందని, అధికారులు స్పందించి వెంటనే కళాశాలలో అదనపుగదులను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎఫ్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు గురువారం ధర్నానిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జహీరాబాద్ పట్టణకమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతోకలిసి ర్యాలీగా ఆర్‌డిఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ ఏరియా అధ్యక్షులు హరీష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేకసమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయని, విద్యార్థులు విద్యపై తమ దృష్టిని సారించలేకపోతున్నారని విచారం వ్యక్తంచేశారు. కళాశాలలో 8వందలకు పైగా విద్యార్థులు విద్యను అందుకుంటున్నా సరిపడ గదులు లేక విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలకు ప్రహరీగోడ సక్రమంగా లేకపోవడం అటుగా ప్రజలు తిరిగాడుతుండటంతో విద్యార్థులు విద్యను అందుకునేందుకు, అధ్యాపకులు పాఠాలు బోధించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల ఆవరణలో డ్రైనేజి సిస్టం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదికారులు స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకోవలసి వస్తుందని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, ఇస్మాయిల్, అభి, చిన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ దోపిడీ నుంచి విద్యారంగాన్ని కాపాడాలి!

**-పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి అనిల్**



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సహాయకార్యదర్శి అనిల్

**జోగిపేట, జూలై 23, ప్రభాతవార్త:**
కార్పొరేట్ దోపిడీ నుంచి విద్యారంగాన్ని కాపాడాలని, ఇందుకని ప్రైవేటు రంగంలోని విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని పిడిఎస్‌యు జిల్లా సహాయకార్యదర్శి అనిల్ అన్నారు. రాష్ట్రంలో కళాశాలలు, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త బంద్ కార్యక్రమంలో భాగంగా జోగిపేటలో అన్ని విద్యాసంస్థలు సంపూర్ణంగా బంద్‌పాటించేలా చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చినహామీలను నెరవేర్చటంలో విఫలమైందని విమర్శించారు. బలహీనవర్గాల విద్యార్థులను విద్యకు దూరంచేసేవిధంగా ప్రభుత్వంతీరు ఉందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో ఉన్నసమస్యలను పరిష్కరించి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు దినేష్, సన్నీ, నాని, జేమ్స్, గణేష్, ఆకాశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి భవనాన్ని పరిశీలించిన డిఎంఅండ్‌హెచ్ఓ



పిహెచ్‌సి భవనాన్ని పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఓ గాయత్రిదేవి

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ గాయత్రిదేవి పరిశీలించారు. ఈనెల 23న పిహెచ్‌సిభవనాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాలతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. భవనంలో మిగిలి ఉన్న పలుపనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు డిఎంఅండ్‌హెచ్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సంధ్యారాణి, వైద్యులు డాక్టర్ హరణి, డాక్టర్ ప్రతిభ, హెచ్ఎ రామచందర్ తదితరులు ఉన్నారు.

## రేపటి నుంచి మండలస్థాయి కాంప్లెక్స్ సమావేశాలు

**-మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్**

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పిఎస్, యుపిఎస్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులకు ఈ నెల 24, 25వ తారీఖులలో మండలస్థాయి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 24న సిర్గాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 25న వాసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే సమావేశానికి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వారిలో సగంమంది ఉపాధ్యాయులు ఒక రోజు సిర్గాపూర్ పాఠశాలలో, మరో సగంమంది ఉపాధ్యాయులు వాసర్ పాఠశాలలో నిర్వహించే సమావేశాలకు హాజరు కావాలని సూచించారు. ఏక ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలకు పక్క పాఠశాల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామన్నారు. పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి శిక్షణతోపాటుగా విద్యాప్రమాణాల మెరుగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి ఉపాధ్యాయులు తమకు కేటాయించిన తేదీల్లో శిక్షణ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని ఎంఈఓ నాగారం శ్రీనివాస్ మండల ఉపాధ్యాయులకు సూచించారు.

## విధులను బహిష్కరించిన ఈ ఆపరేటర్లు



ఎంపిడిఓకు వినతిపత్రం అందచేస్తున్న ఈ ఆపరేటర్లు

**నాగల్‌గిద్ద, జూలై 23, ప్రభాతవార్త:**
బకాయివేతనాలను అందించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఈపంచాయతీ ఆపరేటర్లు విధులను బహిష్కరించారు. గురువారం మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని మండలపరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారికి ఆపరేటర్లు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సంఘం పిలువు మేరకు విధులను బహిష్కరించామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆపరేటర్లు డిమాండ్‌చేశారు.

## ఝరాసంగం ఎస్ఐగా పాటిల్ క్రాంతికుమార్

**ఝరాసంగం, జూలై 23, ప్రభాతవార్త:**
ఝరాసంగం పోలీసుతాణా ఎస్ఐగా పాటిల్ క్రాంతికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన టి.నరేష్ కోహీర్ పోలీసుతాణాకు బదిలీకావడంతో జిల్లా హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న పాటిల్ క్రాంతికుమార్‌ను ఝరాసంగం ఠాణాకు జిల్లా ఎస్‌పి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పాటిల్ క్రాంతికుమార్‌కు నాయకులు ఘనంగాసన్మానించి స్వాగతంపలికారు. కార్యక్రమంలో శ్రీకేతకిసంగమేశ్వరస్వామి ఆలయకమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సోయల్, నర్సింలు అభిషేక్‌రెడ్డి, రజాక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా మహేశ్ బాధ్యతల స్వీకరణ

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
సిర్గాపూర్ పోలీసుతాణా ఎస్ఐగా మహేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పోలీసుతాణాలో ఎస్‌గా సేవలు అందించిన వెంకట్‌రెడ్డి సిఐగా పదోన్నతి పొందిన విషయం పాఠకులకు విదితమే. పోలీసుతాణాలో గత రెండుమాసాలుగా ట్రైనీ ఎస్‌గా విధులు నిర్వహించిన మహేష్‌ను ఠాణా ఎస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ ఉత్తర్వులు జారీచేయడంతో గురువారం మహేష్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

## చిన్నారుల పోషణపై దృష్టి సారించండి

**-సిడిపిఓ జయరాం నాయక్**



చిన్నారుల బరువును పరిశీలిస్తున్న సిడిపిఓ జయరాంనాయక్

**చౌటకూరు, జూలై 23, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషణపై బాధ్యులు దృష్టి సారించాలని పటాన్‌చెరు సిడిపిఓ ఎం.జయరాంనాయక్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం పర్యవేక్షకురాలు సల్మాతోకలిసి సందర్శించారు. ఈసందర్భంగా చిన్నారుల ఎదుగుదల- తరుగుదల కార్యక్రమంలో భాగంగా 0-5 ఏళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువులను తీస్తూ వారి పోషణస్థితిని గుర్తించాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి లలితకుమారి జిల్లాలో 5ప్రాజెక్టులను ఎంపికచేశారని ఆయా ప్రాజెక్టులను ప్రతిష్మాత్మకంగా తీసుకుని చిన్నారుల ఎదుగుదల, తరుగుదలపై ప్రత్యేకడ్రైవ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గమ్మ, సత్యనీల, నాగమణి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## మోతాదుకు మించి యూరియా వాడితే పంటలకు నష్టం

**-జోగిపేట వ్యవసాయశాఖ ఏడిఏ రమాదేవి**

**జోగిపేట, జూలై 23, ప్రభాతవార్త:**
వరి, మొక్కజొన్న, పత్తి, కంది తదితర పంటలలో మోతాదుకు మించి యూరియా వాడొద్దని వ్యవసాయశాఖ జోగిపేట డివిజన్ ఏడిఏ రమాదేవి అన్నారు. బుధవారంం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మోతాదుకు మించి యూరియాను వాడటంవల్ల భూసారం దెబ్బతినటంతోపాటు చీడపీడలు పంటలను ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని తెలిపారు. అందుకని పంటకు అవసరంమేరకు మాత్రమే యూరియాను వాడాలని ఆమె రైతులకు సూచించారు. యూరియాకు బదులుగా నానో యూరియా, డిఏపి వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. ఎకరాకు అర లీటర్ నానోయూరియా సరిపోతుందన్నారు. మండలవ్యవసాయ అధికారి శ్రీహరి మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరతలేదని, డిసిఎంఎస్, పిఏసిఎస్, హాకాల ద్వారా రైతులకు వారంవారం సరిపడు ఎరువులు దఫదఫాలుగా తెప్పించటం జరుగుతుందని తెలిపారు. కాబట్టి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు.

## వసతి గృహాన్ని సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ




వసతి గృహాన్ని సందర్శించిన న్యాయ సేవాధికారసంస్థ సభ్యులు

**నాగల్‌గిద్ద, జూలై 23, ప్రభాతవార్త:**
మండల పరిదిలోని మోర్గి గ్రామంలోని మోడల్ వసతిగృహాన్ని బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ బాధ్యులు సందర్శించారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీధర్ మందని ఆదేశాల మేరకు మండలంలోని మోడల్‌స్కూల్, వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థినులకు ఎదురవుతున్న సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇబ్బందులు, సమస్యలకు గురయితే వెంటనే దగ్గరలోని అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్‌సి ప్యానెల్ న్యాయవాది డి.చంద్రశేఖర్‌రావు, న్యాయవాదులు సుధాకర్‌రాజునాయక్, నాగల్‌గిద్ద పోలీసుతాణా ఎస్ఐ రవీందర్, ఎంఎల్ఎస్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన కంప్యూటర్ ఆపరేటర్లు



ఎంపిఓకు వినతిపత్రం అందచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

**మనూర్, జూలై 23, ప్రభాతవార్త:**
ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ గురువారం ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విధులను బహిష్కరిస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి హైమద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందచేశారు. రాష్ట్రస్థాయి ఈపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ఎంపిఓకు ఆపరేటర్లు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఈపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు జుకాంటి తుకారం, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ మధుకర్

**సిర్గాపూర్, జూలై 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అంతర్‌గావ్‌లో 132/33కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి విద్యుత్‌శాఖ ఈఈ మధుకర్, ఎడిఈ వై.నాగిరెడ్డి, ఏఈఈ సిహెచ్ కళ్యాణ్‌బాబులతోకలిసి స్థలాన్నిపరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గ్రామాన్నిసందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని సమస్య పరిష్కారానికి విద్యుత్ సబ్ స్టేసన్ ఏర్పాటుకు కృషిచేస్తామని ప్రజలకు హామిచేసిన విషయం పాఠకులకు విదితమే. ఇందులో భాగంగా విద్యుత్ అధికారులు గురువారం గ్రామానికి చేరుకుని గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.

## కేతకి సంగమేశ్వరుడికి కానుకగా రూ.29లక్షలు



శ్రీకేతకి సంగమేశ్వరుడి ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, జూలై 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువుండి దక్షిణకాశీగా భక్తులతో నిత్యపూజలందుకుంటున్న శ్రీకేతకి సంగమేశ్వరుడి ఆలయహుండీని బుధవారం ఆలయకమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈఓ శివరుద్రప్ప, ఆలయ ధర్మకర్తలు మల్లయ్యస్వామి, నవాజ్‌రెడ్డి, శివకుమార్, మల్లికార్జున్‌ల సమక్షంలో కామారెడ్డి శ్రీభ్రమరాంబిక సేవా సమితి జహీరాబాద్ శ్రీభ్రమరాంబిక సేవాసమితిబాధ్యులు 65రోజులకు సంబంధించిన లెక్కించగా రూ.28లక్షల79వేల750లను ఆలయానికి చేరుకున్నభక్తులుచెల్లించుకున్నట్లు ఆలయకమిటీ ఛైర్మన్, ఆలయ ఈఓలు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, పోలీసు అధికారులు, రికార్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

## హద్నూర్ ఎస్ఐగా దోమ సుజిత్

**న్యాల్‌కల్, జూలై 23, ప్రభాతవార్త:**
హద్నూర్ పోలీసుతాణా ఎస్ఐగా దోమ సుజిత్ పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన చల్లా రాజశేఖర్‌ను సంగారెడ్డి పట్టణ పోలీసుతాణాకు బదిలీచేయగా, సంగారెడ్డి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో సేవలు అందిస్తున్న దోమ సుజిత్‌ను హద్నూర్ పోలీసు ఠాణాకు బదిలీచేస్తూ జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఐగా పదవీబాధ్యతలు స్వీకరించిన దోమ రజిత్‌కుమార్‌కు ఆయాపార్టీల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

# పోషకాహారలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

**-జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి

**జోగిపేట, జూలై 23, ప్రభాతవార్త:**
పోషకాహారలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి సూచించారు. బుధవారం జోగిపేట ఐసిడిఎస్ ప్రాజెక్టుపరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో జోగిపేటలోని వాసవి కళ్యాణమండలంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను బాగా చూసుకోవాలని, వారికి తమకేంద్రాల ద్వారా అందించాల్సిన మెనూ సక్రమంగా అందేలా చూడాలన్నారు. పోషకాహారలోపం ఉన్నపిల్లలను గుర్తించి వారికి అవసరమైన ప్రోటీన్ ఫుడ్ అందచేసి, ఆ పిల్లలపట్ల శ్రద్ధచూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నడపాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో ఎలాటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు కేంద్రాలను తనిఖీచేసి గ్రోత్ రిపోర్టులను పరిశీలించాలని, ఏమైనా లోపాలుంటే అవసరమైన సలహాలు, సూచనలు టీచర్లకు అందచేయాలన్నారు. ఇవేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే పలుకార్యక్రమాలన్నీ కూడా సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె టీచర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ప్రియాంకతోపాటు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.